# తోడులేని చెల్లి

–యల్లంరాజు సరోజానిర్మల

**''పిల్లవాడు ఎక్కడికి వెళ్లాడో...**

**సుశీలకి భయంగా, ఆదుర్దాగా వుంది.**

**''వాడిక్కడే ఎక్కడో ఆడుకుంటూ వుంటాడు కాని, నువ్వు లేచి వెళ్లి మొహం కడుక్కో, చమ్కీ కుట్టిన చీరా, మల్లెపూలు పక్కమీద పెట్టాను...'' అప్పటికి అయిదోసారి కేకేసింది అనసూయమ్మ...**

**సు**శీల కిటికీ దగ్గర్నుంచీ కదలలేదు... ఉండిండి కళ్లల్లో నీళ్లూరుతున్నాయి... రేపటి రోజు తనలోఆశలు రేపుతోంది...

''బాబుని వెతికి తీసుకురమ్మని మస్తాన్ని పంపుతాను. నువ్వెళ్లి చీర మార్చుకో...లేకపోతే అమ్మకు కోపం వస్తుంది...'' జయ మంగళ స్నేహంగా భుజం తట్టింది.

సుశీల అయిష్టంగా లేచింది... సబ్బుతో మొహం కడుక్కుని మంచం మీద పెట్టి వుంచిన చీర కట్టుకుంది. పౌడరు, తిలకం, కాటుక, తీసుకుని అద్దం ముందు కూర్చుంది.

వికృతమైన ఒక రూపం వెక్కిరిస్తూ కనబడింది అద్దంలో...

ముప్పై ఏళ్లకే నుదిటిమీద ముడతలు, జారిపోయిన బుగ్గలు, రంగు వేసిన జుట్టులోంచి తొంగి చూస్తున్న తెల్ల వెంట్రుకలు, మలుపు తిరిగి పోతున్న యవ్వనం... భయంకరమైన అనుభవాలతో మగ్గిపోయిన మనస్సు...

అద్దం తీసి ప్రక్కన పెట్టి గబ గబా జడ వేసుకుని, బొట్టు పెట్టుకుంది సుశీల. రంగనాయకి యింతబారు మల్లెదండ తెచ్చి తల్లో పెట్టింది.

మల్లెల వాసనకి కడుపులో త్రిప్పి భళ్లున వాంతి వచ్చినట్లైంది సుశీలకి.

ముందు హాలులో రంజని, ముంతాజ్, కమల, జయమంగళ, అనసూయమ్మ చుట్టూ చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు.

మొహాలకు వేసుకున్న మేకప్పులు, ఒంటికి రాసుకున్న అత్తరులు, తలల్లో పువ్వులు కలగలిసి ఒక వెగటు కంపు గదంతా వ్యాపించి వుంది.

''ఇవాళ రంగారావు నాకు వాచీ తెచ్చిస్తానన్నాడు.''

జాకెట్టు సర్దుకుంటూకొంచెం బడాయిగా అంది కమల.

''నీ మొహం... వాడుత్త కోతలరాయుడు. క్రితం వారం నాకు ఫారిన్ సెంటు తీసుకు వస్తాడని కోసాడు. తీరా కాలువ ఒడ్డున అమ్మే రెండురూపాయల సెంటు బుడ్డీ తెచ్చిచ్చాడు...'' ఛీ కొట్టింది మేరీ...

''ఇదిగో అమ్మా! ప్రక్క అంగడి వెంకట స్వామి వస్తే నేను పోను... వాడికి బొల్లి ఒళ్లంతా పాకింది... ఛీ... అసహ్యం...'' మొహం చిట్లించింది ముంతాజ్...

''మొన్న బజారులో చుక్కలున్న గులాబీ సిల్కు చీర చూసాను. అయిదు వందలు... చేతిలోఅంత డబ్బు లేక నోరు మూసుకుని బయటకు వచ్చేసాను... ఇదిగో అమ్మాయిలూ... ఒక్కవారం రోజుల పాటు... ఎవరూ నాకు పోటీ రాకండి... వచ్చేవారం కావాలంటే నా పాసింజర్లని మీకిస్తాలే...'' బేరాలాడింది జయ మంగళ...

మధ్య మధ్యలో జోక్స్ వేసుకుంటూ పెద్దగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు వాళ్లు...

ఎప్పటిలా వెళ్లి వాళ్ల ప్రక్కన కూర్చోలేదు సుశీల...

ఆమె ఆలోచనలు వేరుగా వున్నాయి. మళ్లీ వెళ్లి కిటికీ దగ్గర నిలబడింది సుశీల...

తన జీవితంలాగే ప్రకృతిపై కూడా ఎవరో నల్లటి తెర పరుస్తున్నారు... తెర వెనుక గత జ్ఞాపకాలు...

అప్పుడు తనకు ఐదేళ్లు వుంటాయేమో... నాన్నగారు ఏ ఉద్యోగం చేసేవారో తెలియదు కాని, యింట్లో ఎప్పుడూ ఇద్దరు ముగ్గురు నౌకర్లుండే వాళ్లు... అందులో ఒకరు కేవలం తనని ఎత్తుకునేందుకే వుండేవారు. అమ్మ రోజా తనకి ఒంటినిండా నగలు పెట్టి చూసి మురిసిపోయేది...

అప్పుడు పుష్కరాలనుకుంటాను... అమ్మా, నాన్నగారు, తనూ జాబిల్లి, వెంకన్న కారులో విజయ వాడ వచ్చారు..

గుళ్లో చాలా సందడిగావుంది... జనం బారుగా నిలబడి వున్నారు. అమ్మ కళ్లు మూసుకుని ఏవో పాటలు పాడుకుంది. తనకి బాగా గుర్తు... ఎవరో పాము... అంటూ అరిచారు... జనం భయంతో చెల్లా చెదరైపోయారు... అమ్మ చెయ్యి పట్టుకుని పరుగెత్తుతున్న తనని ఎవరో గుంజుకున్నారు. ఆ తొక్కిసలాటలో అమ్మ అరుపులు, తన ఏడ్పులు ఎవరూ పట్టించుకోలేదు.

కళ్లు తెరిచేసరికి తను అనసూయమ్మ యింట్లో వుంది...

అమ్మ కావాలని తను విపరీతంగా ఏడ్చింది.

అప్పటికి ఈ అనసూయమ్మ చిన్నది తనని ఎత్తుకుని ముద్దు పెట్టుకునేది. బుజ్జగించి అన్నం తినిపించేది. కాని అమ్మ మాట ఎత్తితే మాత్రం కోపగించుకునేది.

మరీ చిన్నతనంలో తెలీలేదు కాని తొమ్మిది, పది సంవత్సరాలొచ్చే సరికి తానెక్కడ వున్నది తనకి తెలిసిపోయింది. పసిపిల్ల అనైనా చూడకుండా అక్కడికొచ్చే మగాళ్లు తనని చూసే చూపులు అప్పట్లో అర్థమయ్యేవి కావు. సాధ్యమైనంత వరకు వాళ్ల కంటపడకుండా తప్పించుకునేది.

ఏడో తరగతి చదువుతుండగా తను పెద్ద మనిషైంది. చచ్చిపోతానని బెదిరించినా అనసూయమ్మ తనని మరి బడికి పంపలేదు.

తరువాత అనసూయమ్మ తనని బలవంతంగా రొంపిలోకి దింపింది. ఎందరో మగవాళ్లు తన జీవితం మీంచి నడచి వెళ్లిపోయారు.

బంజరై పోయిన తన బుర లో ఒకరోజు ఆకుపచ్చటి కోరిక మొలిచింది.

మొదట అనసూయమ్మ ఒప్పుకోలేదు. తను బ్రతిమాలి, కాళ్లా వేళ్లా పడ్డాక ఏ కళనుందో 'సరే' అంది. ఏడాది తిరక్కుండా తను పండంటి మగబిడ్డ నెత్తుకుంది.

ఆలిగా బ్రతికే అదృష్టం తనకు లేకపోయినా



అమ్మగా మాతృత్వాన్ని పొందగల తన అధికారాన్ని ఎవరు కాదనగలరు? నిరర్థకంగా ముగిసి పోతుందనుకున్న తన జీవితానికొక సార్థకత ఏర్పడింది...

'అమ్మా' అని పిలిచేందుకు నోచుకోని తను 'అమ్మా' అని పిలిపించుకునేందుకు హక్కుదారు అయింది తను కోల్పోయిన అనురాగ ఆప్యాయతలు తన బిడ్డకి సంపూర్ణంగా అందిస్తుంది తను.

తొలిసారి వాడు పాలు త్రాగినపుడు తొలి అడుగు వాడు వేసినప్పుడు తొలిసారి 'అమ్మా' అని వాడు



## నేనూ అంతే

**నిజమైన నటులకీ, ప్రతిభకూ ముగింపు లేదు. సీన్ కానరీ, అమితాబ్ వీరంతా ఎలా పైకి వచ్చారు? ఏ రోజు కారోజు కొత్తకొత్తవి నేర్చుకోవడం వల్ల. నేనూ అంతే. లోకంలో ఎన్నో పుస్తకాలున్నాయి. వాటన్నిటినీ కాకపోయినా కొన్ని అయినా చదవటం, సినిమాలు చూడటం ద్వారా ఎక్కువ జ్ఞానాన్ని పొందుతాం. నేను కూడా అలాగే చేసి ఈ స్థాయికి వచ్చాను అన్నాడు షారూక్ - మీరు గొప్ప స్టార్ ఎలా అయ్యారిని అడిగితే.**

పిలిచినపుడు తను పొందిన ఆనందం అంతా యింతా కాదు.

ప్రపంచాన్ని జయించినంత గర్వం కలిగింది తనకు. ఇప్పుడు తను ఒంటరి కాదు... 'నా' అని చెప్పుకునేందుకు తనకొక కొడుకున్నాడు. నోములు నోచి, వ్రతాలు వుపవాసాలు చేసినా కొందరికి దక్కని అపురూప కానుక తను అలవోకగా సాధించుకుంది.

''మోహనరావు వచ్చాడు... అమ్మ నిన్ను రమ్మంటోంది.'' భుజం పట్టి కదుపుతూ పిలిచింది జయమంగళ. స్వర్గం లోంచి ఒక్కసారి ఎవరో తనని నరకంలోకి తోసేసినట్లైంది సుశీలకి...

ఉలిక్కిపడి వర్తమానంలోకి వచ్చింది సుశీల. బాగా చీకటి పడిపోయింది. వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధిదీపం చుట్టూ పురుగులు ముసిరిపోతున్నాయి. చెత్తకుండీ దగ్గర ఎండిన ఎంగిలి విస్తళ్ల కోసం కుక్కలు యింకా కొట్లాడుకుంటూనే వున్నాయి.

బాబు ఎక్కడి కెళ్లాడో... యింకా రాలేదు... తల్లి పేగు పీకినట్లయింది.

''నాకు ఒంట్లో బాగా లేదు... అమ్మతో చెప్పు'' అంటూ లోపలి గదిలోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకుంది సుశీల...

ఆలోచనలు సాదరంగా ఆహ్వానించాయి సుశీలను.

మూడో ఏడు నిండుతుండగా బాబును స్కూల్లో వేద్దామనుకుంది తను... హాస్టల్లో వేసి ముందు వాణ్ణి ఈ వాతావరణానికి దూరంగా వుంచాలి... తరువాత తను కూడా మెల్లిగా ఇక్కణ్ణుంచీ బయట పడాలి అనుకుంది సుశీల...

సుశీల వుద్దేశ్యం గ్రహించలేనంత అమాయకురాలు కాదు అనసూయమ్మ.

''మరీ పసి వెధవ... అయిదేళ్లయినా వెళ్లనీ... మగపిల్లవాడు. ఇవాళ కాకపోతే రేపయినా చదువు వుండేదే కదా! తల్లిని కావాలో, తల్లిని కావాలోఅల్లాడిపోయావు కదా, కనీసం అయిదేళ్లు నిండే వరకైనా నీ దగ్గరుంచుకుని ముద్దూ ముచ్చటా తీర్చుకో...'' సలహా యిచ్చింది అనసూయమ్మ...

'నిజమే' అనిపించింది తనకి కూడా.. అవును. ఇప్పుడుండక పోతే మరెప్పుడుంటాడు తన దగ్గర. వాడిని బాగా చదివించి మంచి ఆఫీసరును చేయాలి... చక్కటి పిల్లని చూసి పెళ్లి చేయాలి... కొడుకు కోడలు నీడలో తన వృద్ధాప్యం ప్రశాంతంగా గడచి పోవాలి...

బాబుకి యిప్పుడు అయిదు నడుస్తున్నాయి... ఇక తను మెల్లిగా పిల్లవాడితో సహా బయట పడాలి... ఇది వరకులా తనలో పిరికితనం లేదిప్పుడు. 'అమ్మ' హోదా తనలో ఎంతో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. కూలీనాలీ చేసైనా బిడ్డను పోషించుకోగలనన్న నమ్మకం తనకుంది.

ఆమె తపస్సును భగ్నం చేస్తూ ఎవరో గట్టిగా తలుపు బాదారు. ఒక్క ఉదుటున లేచి తలుపు తీసింది... కాని వచ్చింది బాబు కాదు... ఎవరో వచ్చి ఏదో వస్తువు తీసుకుని వెళ్ళారు.

పసి పిల్లవాడు. ఇంత రాత్రి వరకు... ఎక్కడకు వెళ్లినట్లు. ఈ మధ్య అనసూయమ్మ బాబుని ఎందుకో... తెగముద్దు చేస్తోంది... చేతిలో పావలా, అర్ధా పెడుతోంది. ఏమైనా కొనుక్కు తినమని... తనకి అసహ్యమనిపించి అనసూయమ్మతో గట్టి తగూ పెట్టుకుంది... 'ఓ యబ్బో... ఇదేం చోద్యం తల్లీ... అక్కడికి ప్రపంచంలో మొదటిసారి నువ్వే తల్లైనట్లు... పసిపిల్లాడి చేతిలో ఒక్క పావలా పెడితే తప్పా...'

బాబుని దగ్గర కూర్చోబెట్టుకుని ఎన్నోసార్లు ప్రేమగా వాడికర్థమయ్యే భాషలో అనసూయమ్మ మంచిది కాదు అని చెప్పింది.

తన మాటలకి తలూపినా మళ్లీ చాక్లెట్లు, చిల్లర డబ్బులు చూడగానే అనసూయమ్మ ఒళ్లోకి వెళ్లిపోయేవాడు.

పాప పుణ్యాలెరుగని పసి మనస్సు అపవిత్రం కాకముందే వాణ్ణి తీసుకుని తను ఎటైనా పారిపోవాలి... ఎక్కడికి... ఎక్కడికైనా సరే... ఈ మురికి కూపానికి దూరంగా...

పిల్లవాడి నవ్వు గట్టిగా వినబడింది...

ప్రాణం లేచి వచ్చినట్లైంది సుశీలకి. అమ్మయ్య... బాబు వచ్చాడు. తన ప్లాను ప్రకారం అంతా సవ్యంగా సాగితే వచ్చే వారమే తను వెళ్లిపోవచ్చు...

మాతృ హృదయం వుప్పొంగగా తలుపు తెరిచి హాల్లోకి చూసింది సుశీల...

సోఫాలో ఎవరో యిద్దరు మగవాళ్లున్నారు... అనసూయమ్మ వారితో నవ్వుతూ మాట్లాడుతోంది... బాబు ఆమె వళ్లో కూర్చుని వున్నాడు. వాళ్లేదో చిల్లర యిస్తున్నారు... వాడు నవ్వుతూ చెయ్యి చాపుతున్నాడు... గుండె పగిలి పోయింది సుశీలకి.

విసురుగా హాల్లోకి వెళ్లి వాడి జబ్బ పట్టుకుని యివతలి కీడ్చి ఆ చెంపా ఈ చెంపా వాయించి పారేసింది... ఆ విసురుకి చేతిలో చిల్లర ఎగిరి వెళ్లి అనసూయమ్మ ఒళ్లో పడింది...

గోలు గోలున ఏడుస్తున్నాడు బాబు.

''ఏరా కక్కుర్తి వెధవా? ఎవ్వరైనా డబ్బులిస్తే తీసుకోవద్దని చెప్పానా... గడ్డి తింటున్నావా మళ్లీ...' వాడి ఒంటి మీద సుశీల వేళ్లు వాతల్లా తేలుతున్నాయి...

రొప్పుతూ ఒక్క క్షణం ఆగింది సుశీల...

అదే అదనుగా బాబు గబుక్కున భుజం విడిపించుకుని అదే అదనుగా బాబు గబుక్కున భుజం విడిపించుకుని తలుపు వైపు పరిగెత్తాడు. వెనక్కి తిరిగి రోషంగా తల్లివైపు చూసాడు. వాడి కళ్ల నిండా నీళ్లు...

అమ్మ మనస్సు ఆర్ద్రమై పోయింది. రెండడుగులు ముందుకు వేసి ఆప్యాయంగా, ఆర్తిగా వాడి వైపు చేతులు చాచింది దగ్గరకు రమ్మన్నట్లు...

''పోవే లం...'' రోజూ ఆ యింట్లో పదే పదే వినబడే ఆ మాటనే అరుస్తూ బయటకు పారిపోయాడు బాబు.